# 22,184 ఉపాధ్యాయ ఖాళీలు

- 16.61% ప్రైమరీ స్కూళ్లకే విద్యుత్ సదుపాయం
- ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి సరిగా లేనివి 32.03%
- దేశవ్యాప్తంగా టీచర్ పోస్టుల ఖాళీలు 8.33 లక్షలు
- అంతర్రాష్ట్ర సమావేశంలో కేంద్రం వెల్లడి
- తక్షణం టీచర్ పోస్టులు భర్తీ చేయండి
- స్కూళ్లలో వసతి సదుపాయాలు కల్పించాలని ఆదేశం




సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేవు. వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలి' అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతర్రాష్ట్ర సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో స్కూళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఎలా ఉంది, టీచర్ పోస్టులు ఎన్ని ఖాళీలున్నాయని, మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో ఈ ఏడాది మార్చినాటికి ఏకంగా 22,184 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ఇందులో ప్రాథమిక స్కూళ్లలో(1 నుంచి 8వ తరగతి వరకు) 17,128 పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో 5,056 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపింది. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో సగటు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 18గా ఉందని, 32.03 శాతం ప్రాథమిక పాఠశాలల్లో నిబంధనల మేరకు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి అమలు జరగడం లేదని కేంద్రం వెల్లడించింది.

### గ్యాస్ కనెక్షన్లు లేని స్కూళ్లు 33,630

స్కూళ్లలో విద్యుత్ సరఫరా, మధ్యాహ్న భోజనానికి గ్యాస్ కనెక్షన్ల విషయంలోనూ రాష్ట్రం వెనుకబడి ఉందని కేంద్ర అధ్యయనంలో తేలింది. మధ్యాహ్నం భోజనం అమలు చేస్తున్న 33,630 స్కూల్స్‌లో వంట గ్యాస్ కనెక్షన్లు లేవని కేంద్రం పేర్కొంది. రాష్ట్రంలోని 16.61 శాతం

మిగతా 2వ పేజీలో ▶

# 22,184 ఉపాధ్యాయ ఖాళీలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక పాఠశాలలకే విద్యుత్ సరఫరా సౌకర్యం ఉందని, అలాగే 53.16 శాతం అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లోను, 68.81 శాతం సెకండరీ పాఠశాలల్లోను, 44.35 శాతం ఉన్నత సెకండరీ స్కూళ్లలోనే విద్యుత్ సరఫరా సౌకర్యం ఉందని తేల్చింది. పోస్టుల భర్తీతోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రాథమిక పాఠశాలల్లో 8.33 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. దేశంలోని మొత్తం స్కూళ్లలో 8.5 శాతం స్కూళ్లు సింగిల్ టీచర్‌తోనే కొనసాగుతున్నట్లు తెలిపింది. ఇక 64 శాతం స్కూళ్లలో ప్రధానమైన సబ్జెక్టులకు వేర్వేరు టీచర్లు లేరని తెలిపింది.

కేంద్ర అధ్యయనంలో రాష్ట్రంలో స్కూళ్లలో ఖాళీలు, ఇతర సౌకర్యాల స్థాయి ఈ విధంగా ఉంది.

### పాఠశాలలకు కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాల పరిస్థితి ఇలా..

| | |
|---|---|
| కంప్యూటర్ పాఠాలు లేని ప్రాథమికోన్నత పాఠశాలలు | 92.16% |
| కంప్యూటర్, ఇంటర్నెట్ లేని ఉన్నత పాఠశాలలు | 65.25% |
| కంప్యూటర్, ఇంటర్నెట్ లేని ఉన్నత సెకండరీ స్కూల్స్ | 70.70% |
| ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్స్ లేని సెకండరీ స్కూల్స్ | 69.15% |



### మధ్యాహ్న భోజన పథకంలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు

| | |
|---|---|
| మొత్తం స్కూల్స్ | 45,594 |
| గ్యాస్ కనెక్షన్ ఉన్నవి | 11,964 (26 శాతం) |

### ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల వివరాలు..

| కేటగిరి | మంజూరు | పనిచేస్తున్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| రాష్ట్రం | 1,22,926 | 1,05,798 | 17,128 |
| సర్వశిక్ష అభియాన్ | 24,213 | 24,213 | ---- |
| మొత్తం | 1,47,139 | 1,30,011 | 17,128 (11.64 శాతం) |



### ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు వివరాలు

| | |
|---|---|
| మంజూరైన పోస్టులు | 61,793 |
| పనిచేస్తున్న వారు | 56,737 |
| ఖాళీలు | 5,056 |